# చీకటి బ్రతుకులు

అడబాల వి.వి. సత్యనారాయణ




చీకటయింది.

సత్యవతికి ఆకలేసింది.

వారం రోజులుగా జ్వరం...

వ్యాపారం బొత్తిగా లేదు. పైగా వాడకట్టుకి కొత్తపిట్టలొచ్చారు.

ఈనాటికి జ్వరం కొద్దిగా తెరిపిచ్చింది

లేని సత్తువ తెచ్చుకుంటూ బుడ్డయ్య టీ కొట్టుకు ప్రయాణమైంది. బుడ్డయ్య కొట్టు ఆ 'పేట మొగ'లోనే వుంది. అక్కడికదే ఎడారిలో ఒయాసిస్సు...

టీ కనో. బీడీలకనో, దమ్ముకనో, కిళ్ళీకనో ఇరవై నాలుగ్గంటలూ నిరాఘాటంగా పన్జేస్తూనే ఉంటుందది.

బుడ్డయ్య కునికిపాట్లు పడ్డప్పుడల్లా అతని చిన్న కొడుకు రాముడు నడిపిస్తూంటాడు.

వయసుకి చిన్నయినా వాడికి రాని 'మాట'లేదు తెలియని అర్థమూ లేదు— సంబంధిత సబ్జెక్టుల్లో...

ఇద్దరూ లేరు కొట్టు మూసేసివుంది.

ఎదురుగా ఉల్లిపాయల కొట్టు దగ్గర సైకిలు స్టాండువేసి ఎవరో బట్టల షావుకారులా, తనలాంటివాళ్ళ కోసమే ఎదురు చూస్తున్నట్టనిపించి అటు రెండడుగులు వేసింది.

పదినుంచి బేరమాడుతుంటూ చివరికి ఆరు దగ్గర ఆగేరిద్దరూ.

అందులోనే చిన్నయ్యకొట్టు దగ్గర మల్లెపూలకి కొన్ని డబ్బులూ, సతీష్ హోటల్లో కొన్ని ఖర్చుపెట్టి మిగతా

బేలన్స్ జాకెట్లో దోపుకుంది.

"మీ పేరేంటన్నారు?"

"సత్తిరాజు..."

ఆ పేరు వినగానే ఆమె ఆలోచనలు వెయ్యి మైళ్ళ వేగంతో గతంలోకి దూసుకుపోయాయి.

* * *

అర్థరాత్రి చీకట్లో తనొక్కత్తే పడుకుంది.

తలుపూ ద్వారబంధం లేని ఇల్లు అది.

అమ్మా నాన్నా ఊరికెళ్ళారు, తనని గుడిసెకి కాపలాగా వదిలేసి.

చాన్నాళ్ళుగా, ఆమెను ఎలాగైనా '..............' చెయ్యాలని ఎదురు చూస్తున్న సత్తిరాజుకి అదో పెద్ద అవకాశం అయింది. కుక్కలా గుడిసెలో దూరబడ్డాడు.

తగ్గించిన దీపంబుడ్డి వెలుగులో, స్థలాన్ని బాగా స్టడీచేసి దీపం ఆర్పేసి రాక్షసుళ్ళా ఆమెను, గింజుకుంటున్నా వదలక, యావత్తు శీలాన్నీ గటగటా తాగేసి 'బ్రేవ్'అని తేనుస్తూ వెళ్ళిపోయేడు.

చీకట్లో ఆమె రోదనల్ని వినడానికి గాలిసైతం లేదు. ఆమె భయాన్ని ఆమే క్రమేపీ పోగొట్టుకోగలిగింది. ఉన్న కాస్త గుడ్డివెన్నెలనీ ఏనుగులాంటి రెండు మేఘాలు తాగేశాయ్.

బిందె అడుగున ఉన్న రెండుచుక్కల నీళ్ళని గొంతులోకి ఒంపుకుంది.

ఆడదాన్ని మగాడు అనుభవిస్తాడని చూచాయగా తెలిసినా, అదెలా ఉంటుందో మొట్టమొదటిసారిగా రుచూపింది. ఆమె చేతిలో సత్తిరాజు వదిలేసి వెళ్ళిన పదినోటు- జరిగిన కథకి సాక్ష్యంగా మిగిలింది.

* * *

బట్టల షావుకారు బాహుబంధాల్లోంచి బైటికొచ్చేసరికి కోడికూసింది.

రోడ్డుమీద కరెంటు స్తంభం దగ్గర రిక్షా లింగన్న- 'అచ్చమ్మ'ని బూతులు తిరుతున్నాడు.

'కష్టపడి బేరాలు తీసుకొస్తుంటే డబ్బులు ఎగెయ్యడానికి నీ కెంత ధైర్య'మంటూ జుట్టు పట్టేసుకుంటున్నాడు.

ఆమె కూడా తక్కువ తినకుండా, 'నా కొడకా...' అంటూ నానా బూతులు తిడుతోంది.

అప్పటికే రకరకాల మానవుల, పశువుల, రాక్షసుల చేతుల్లో పగిలిన గాజు గ్లాసులాంటి 'పణ్యస్త్రీ'లంతా బైటికొచ్చి విషయాన్ని సర్దిపంపేరు.

పాపం అచ్చమ్మది పెద్ద సంసారం. ఒకప్పుడు బాగా బతికిన సంసారమే. 'పరిస్థితుల గాలివాన'లో అలా అయింది. చేస్తోంది 'ఆ పని' అయినా గుట్టూమట్టూ వుండాలంటుంది. కాని సాంసారిక పరిస్థితులు' రోడ్డుమీదపడేసి మరీ తన్నుతున్నాయ్.

సత్యవతికి కళ్ళంట నీళ్ళొచ్చాయ్.

"ఆ ఎదవ కొడుక్కి నేనిస్తాన్లే ఎళ్లు."

సత్యవతి- అచ్చమ్మ కళ్ళనీళ్ళు తుడిచింది.

* * *

అచ్చమ్మ ఆ రంగంలో తనకంటే పెద్దది.

అసలు ఒక రకంగా అచ్చమ్మే తనని ఇక్కడికి తీసుకొచ్చింది.

ఆరోజు -నరసింహారావు బైటకి తరిమేసిన రోజు...

తను దొంగ— కాదు.

పిచ్చెక్కి- ఎవర్నీ కరవడంలేదు. తన వల్ల ఆయనకి వచ్చిన లోటల్లా పడక సుఖమే.

భార్య కుందనపు బొమ్మల్లే ఉండేది. ఆమెకి ఇవ్వడం చేతకాదో, ఈయనకి పుచ్చుకోవడం చేతకాదో గాని ఎప్పుడూ ఇతర సుఖాల్నే ప్రిఫర్ చేసేవాడు నరసింహారావు.

అమ్మానాన్నా పోవడంతో అక్కడ పనికి కుదిరింది.

అయితే తను చెయ్యాల్సిన పని అంట్లుతోమడం, ఇల్లు ఊడవటం ఒకటే కాదని, అంతకంటే ముఖ్యమైన పని 'అతిథిని సుఖపెట్టటం' అని చేరిన 24 గంటల్లోనే అర్థమైందామెకి.

అప్పటికే సత్తిరాజు తనని చాలా పొర్లు, ప్రేమాదోమా లాంటి మాయ మాటల్తో మభ్యపెట్టి మోసాంచేసి చేసి వదిలేసి ఉన్నాడు.

సత్తిరాజు మీద కసివున్నా ఇంకో వెంకట్రాజు మీద మరోటున్నా ఏకాకి ఆడదానిగా తనేం చెయ్యగలదు. ఇరవై రోజుల నుండి జ్వరంతో పేలిపోతుంటే వైద్యం చేయించి మామూలు మనిషిని చెయ్యాల్సిన మనిషి దారుణంగా బైటకి పొమ్మన్నాడు. అతని దృష్టిలో సత్యవతి ఓ ఆటబొమ్మ అయిపోయింది.

వీధుల్లో చెదిరిన తలతో, అంతకన్నా చెదిరిన మనసుతో 'వికలం'గా తిరుగుతున్న సత్యవతిని "ఏం పిల్లా, ఏ వూరు మనది" అంటూ ఆప్యాయత లాలికించి అక్కున చేర్చుకున్నది అచ్చమ్మే. బాహుబంధంలో నిలబడే బాధ చెప్పుతుంది.

తల నిమిరి తనదగ్గరే వుంచుకుంది. క్రమేపీ ఆ పరిచయం- ఈనాటి జీవితానికి బలమైన పునాది అయిపోయింది.

* * *

పోలీస్ సుబ్బరాజంటే ఎస్.ఐ.గంగరాజు దగ్గర్నుండీ అందరికీ భయమే. నల్లపోతులా మీసాల్తో భయంకరంగా కనపడే సుబ్బరాజన్నా- ఆకాశం చిల్లులు పడేట్టు అరిచే ఆ అరుపన్నా చాలామందికి భయం.

చేత్తో లాఠీ పట్టుకుని, దాని పెదాల మీద ఆనించి మురళీకృష్ణుడిలా ఫోజు పెట్టాడంటే అతన్నే నమ్ముకున్న నేరగాళ్ళూ నేరగత్తెలు గోపికల్లా చుట్టుముట్టేసి, కానుకలూ, కాకరకాయలూ, లంచాలూ, మేతలూ అతన్నెత్తిమీద

పోసి వెళ్ళిపోతుంటారు.

"ఏయ్!"

సత్యవతి తలతిప్పి చూసింది.

"సుబ్బరాజు బాబుగారా- రండి. పంచదారనీళ్ళు తాగుతారా..."

"నీళ్ళు కాదెహె...పాలు తాగుతా- పాలు..."

ఆ మాటలోని లోతర్థాన్ని అర్థం చేసుకున్న సత్యవతి అర్జంటుగా ఆ చిన్ని ఏర్పాటు చేసింది.

"అమ్మగారు పుట్టింటి కెళ్ళింది పురుటుకి...ఇప్పుడప్పుడే రాదు..."

కాబట్టి వచ్చేదాకా- నే నెప్పుడొస్తే అప్పుడు ఈ చిన్ని ఏర్పాటు తప్పదు సుమా - అనే హెచ్చరిక ఆ మాటలో దాగుంది.

వ్యభిచారం ఓ విచిత్రమైన వృత్తి.

ఈ వృత్తిని నమ్ముకున్నవాళ్ళకి రకరకాల బెడదలున్నా అన్నింటికన్నా పెద్ద బెడద- సుబ్బరాజులాంటివాళ్ళే.

నేరస్తులే వీళ్ళ ఆహార సామగ్రి. వీళ్ళకి కోపంవస్తే చిన్న నేరం పెద్దదై పోతుంది. అసలు నేరం చెయ్యనివాడు కూడా వాళ్ళు తల్చుకుంటే నేరస్తులు అయిపోయి తన్నులు తినెయ్యాల్సొస్తుంది. కొందొకచో ప్రాణాలూ మానాలూ కోల్పోవాల్సొస్తుంది...

"పువ్వుల్లేవా?" ముద్దు పెట్టుకుంటూ అడిగాడు.

"వెధవ. అప్పనంగా అనుభవించేది గాక పువ్వులు కావాలా పువ్వులు..."

పైకి అనాల్సిన మాట లోపలమనుకుని ఊరుకుంది. ధర్మదేవత వలువలు ఒలిచేస్తున్నవాడిలా ఆమె చీర లాగేడు.

కొంతసేపు...

మరికొంత...

ఇంకొంత...

ఆమె గుండెల్లో సన్నగా నొప్పి మొదలైంది.

భారాన్ని భరించడం ఇక వల్లకాక 'సుబ్బరాజుబాబూ లెండి. లేవండి బాబూ.'

సుబ్బరాజు లేవడంలేదు.

ఆఫ్టరాల్ ఇది చెప్తే లేచేదేమిటనో, లేవకపోవడమే తన జన్మహక్కనో, లేక ఇతరులుపడే బాధలో ఆనందం వెదుక్కోవడమోగాని అతడలాగే ఆమె కన్నీళ్ళతో ఆడుకుంటూ, ఆమె గుండె నొప్పిని రెట్టింపుచేసి చివరికెలాగైతేనేం సైకిల్ బెల్ మోగించేడు.

"ఎస్.ఐ. గంగరాజుగారింటికి చుట్టాలొస్తున్నారు. అర్జంటుగా ఐదారు కోడి పెట్టలు కావాలి..."

సుబ్బరాజు అలా ఆ పనిమీద ఆ పనిమీద పోతూ కనుమరుగయ్యేదాకా 'సత్యవతి' చూస్తూనే ఉంది.

తర్వాత కుండలోని చన్నీళ్ళు నెత్తిమీద ఒంపుకుని తీరిగ్గా తనవితాను చదువుకోసాగింది. రెండే రెండు చీరలు మంచివి ఉన్నాయి. ఏదైనా మంచి 'కేసు'తగిలినప్పుడు అవి కట్టుకుంటుంది.



మిగతావి తుక్కు చీరలు... రూపాయ్ పావలా కేసుల్లో అలంకరణకి అట్టే ప్రాధాన్యం ఉండదు. తప్పదు అడుక్కోవడం వృత్తిగా పెట్టుకున్న తర్వాత ఏ చెత్తనైనా భరించాలి...

ఎందుకో ఓసారి మంచిచీర కట్టుకోవాలనిపించింది. కట్టుకుంది. బొట్టు పెట్టుకుంది. మేకుకి తగిలించిన గాజుల్ని వేసుకుంది.

కళ్ళు మూసుకుని తననితాను సంసార స్త్రీగా భావించుకుంది.

తన భర్తకి అన్నం వడ్డిస్తోంది. ఏడ్చే పిల్లల్ని సముదాయిస్తోంది.

అధికారికంగా ఎవరితోనో పోట్లాడుతోంది. వెయ్యిచేతుల్తో ఇంటిని స్వర్గంగా దిద్దుతోంది...

ఇవన్నీ వూహాలేననీ... కరిగిపోయే కలలనీ కళ్ళు తెరిచింతర్వాత గాని తెలీలేదు

ఒక్కసారిగా నిస్సత్తువ ఆమెని ఆవహించింది... నులక మంచమ్మీద కుప్పలా కూలిపోయి ఎప్పటల్లే ఆలోచనల కేపి తలబాదుకుంటూ కన్నీటి సముద్రంలో కొట్టుకుపోసాగింది

* * *

ఆమెకి చీకటంటే మంచి అవగాహన ఉంది. అది అజ్ఞానానికి గుర్తుగా, బాధలకు భయాలకు విలయంగానేకాక- ఓ 'కన్న తల్లి'గా కూడా 'చీకటి'ని అర్థంచేసుకున్న మనిషి సత్యవతి.

కొందరు వెలుగుతో మేలుకుంటారు.

ఎందరో 'చీకటి'తో మేలుకుంటారు.

ఒళ్ళమ్ముకునే అమ్మాయి కావచ్చు.

రిక్షాతొక్కే విద్యార్థి కావచ్చు

దొంగ కావచ్చు. శ్మశానాన్ని కాపలా కాసే మరో హరిశ్చంద్రుడు కావచ్చు.

ఎవరైతేనేం

అందరూ చీకటి మనుషులే...

మనిషిలోని మరో మనిషి గాని, మనిషిలోని రాక్షసుడు గాని చీకటిలో విజృంభించినంతగా వెలుతురులో విజృంభించలేడేమో. అయినా మంచిచెడ్డల ప్రసక్తి వదిలేసి- కొందరు రహస్య వృత్తులవాళ్ళు గోప్యంగా తమ బతుకుల్ని బతికించుకోవడానికి చీకటి రంగస్థలాన్నే ఎన్నుకుంటారు.

చీకటి కన్న తల్లే...

చీకటి అన్నం పెడుతుంది.

చీకటి అక్కున చేర్చుకుంటుంది. కానీ ఎన్నాళ్ళు?

కనీస స్త్రీత్వం - ఆ స్త్రీలో జీవించినన్నాళ్ళు...

రోగం రొమ్ము తగులుకుంటే...

పెదాలు నల్లగా మాడిపోయి- స్తనాలు తూలిపోయి, శరీరం ముకిలిపట్టిపోయి వార్ధక్యమో- అకాల వార్ధక్యమో వచ్చేశాకా ఆ వచ్చిన మనిషివంక ఏ విటుడూ తొంగిచూడడు.

అప్పటివరకూ చీకటి కన్నతల్లే...

అప్పటి నుండే ప్రారంభమౌతాయ్ అసలు కష్టాలు...

సత్యవతికింకా ఆ కష్టం ప్రారంభమవలేదు...

"అయితే ఏం చెయ్యాలి?"

ప్రశ్న వేసుకుని తలనొప్పికి ఓ మాత్ర వేసుకుని ఊహాలోకాన్ని పలకరిస్తూ ఎవరో పిలిచిన పిలుపుకి రెడీ కావడం కోసం సబ్బుపెట్టెతో సహా దొడ్లోకి వెళ్ళింది.

* * *

కాయమ్మ ఇంట్లో మీటింగువుతోంది.

కాయమ్మ ఓ పెద్ద పొలిటికల్ లీడర్ స్టయిల్లో మాట్లాడేస్తోంది.

"మన్లో కానాపుంది ఓ రేటూపాడూ లేకుండా పావలాకి బేడాకి మొగోడెంట ఎళ్ళిపోటం మన వృత్తికే దెబ్బ కొమట్టీ కనీసం ఐదు రూపాయిలకి తక్కువ కాకుండా రేటుపెడితే బాగా ఉంటదని నా ఉద్దేశం..." కాయమ్మ రుబ్బురోలు తిప్పినట్లు తన మాటలు నాలుగూ తిప్పి తన లావుపాటి శరీరాన్ని నేలకి చేరవేసింది.

"దేవిస్టం దానిది. ఈ మీటింగులూ గీటింగులూ అనవసరం..." కృష్ణ

కుమారి అనే కొత్తమ్మాయి పలికీపలకకుండా పలుకుతోంది.

“ఒకవేళ ఐదుకి తగ్గకూడదని పెట్టేమే అనుకుందాం. తీరా మోపి రూల్ ఎవత్తె అయినా దాటేత్తే ఏంచెయ్యాలి” ‘గంగ’ అనే అమ్మాయి బొంగురు గొంతుతో ప్రశ్నించింది.

“నీ ఉద్దేశమేంటి పిల్లా?” కాయమ్మ సత్యవతిని అడిగింది.

“ఇంత టిక్కెట్టు అని పెడితే దేవుణ్ణి చూసొస్తారు... ఇంత టికెట్టు అన్చెప్పి సినిమా చూసొస్తారు. ‘ఇంత’ అనే మాట దేనికైనా కుదురుద్దేమోగాని దీనిక్కుదరదప్పా...కొత్తగా యాపారాని కొచ్చిన పిల్లలకి ఎలాగూ నాలుగు డబ్బులొస్తాయి. పాతోళ్ళకి కాస్త తగ్గుద్ది. మరీ ‘రూపాయికీ’ ‘అర్ధకీ’ఎత్తున్నారంటే-యాపారం చేసేవోళ్ళు పెరిగిపోయేరన్నమాట...”

సత్యవతి మరి మాట్లాడలేదు.

‘చిన్నమ్మ’ అనే ఓ సీనియర్ హేండ్ - ఐస్ ఫ్రూట్లు తెచ్చి తలోటీ పంచింది.

“రైసుమిల్లు సత్తాన్ని పట్టేపుకదంటే నువ్వపబ పార్టీ చెయ్యాలి...”

రమణ చంద్రికని ఓ పోటు పొడిచి అంది.

“అడిదగ్గరేముంది నా మొకం. పైన పటారం లోన లొటారం.”

“అణ్ణాదిలేసేవేంటి” రత్తమ్మ మీదకి ఒంగి అడిగింది.

“లేదనుకో” అన్నది కనుబొమల్ని గాల్లోకి ఎగరేస్తూ.

“పతి ఎదవనాకొడుక్కీ ఒళ్ళప్పగించడం కన్నా ఎవణ్ణో ఒకణ్ణి పట్టుకుని బండి నడిపేసుకుంటే బాగా ఉంటదే బాబూ...”

మణెమ్మ తన అమూల్య అభిప్రాయాన్ని వెల్లడించింది.

ఇలా ఆ మీటింగు అసలు స్వరూపాన్ని కోల్పోయి అసలైన పిచ్చాపాటీగా మారిపోయింది.

యింతలో ఎవరో అన్నారు “సత్యవతి ఇల్లు కాలిపోతోంది.”

జనం చీలికలు పేలికలుగా విడిపోయి కకావికలుగా పరుగెత్తారు.

* * *

ఒంటిమీద చీర తప్ప ఏం మిగల్లేదు.

సత్యవతిని అగ్నిదేవుడు దారుణంగా అనుభవించి బూడిదగుట్టను ప్రతిఫలంగా ఇచ్చి వెళ్ళిపోయేడు.

వారం రోజులు కాయమ్మ వసారాలో సర్దుకుంది.

ఎప్పుడు పోతావంటూ ఎనిమిదో రోజు నుంచి ‘నస’ మొదలుపెట్టింది.

టీ కొట్టు బుడ్డయ్యకి మనసు కరిగి, జాలి పెరిగి ఆమెకంటూ చిన్న ఏర్పాటు చేశాడు. అది చేసిందగ్గర్నుంచీ అనుకోకుండా అతని హృదయం కదలడం ప్రారంభించింది. అప్పట్నుంచీ బుడ్డయ్యతో చెప్పుకోదగిన పరిచయం ఏర్పడింది—

* * *

ఒక సత్తిరాజు, ఒక నరసింహారావు తరువాత ఏ ఒక్క మగాడికోసమూ, నమ్మి గాని, విధిలేక బలవంతంగా గాని ఆమె జీవించలేదు.

అగ్ని ప్రమాదం జరిగి గోడుగోడున విలపిస్తున్న వేళ నేనున్నానంటూ బుడ్డయ్యే ముందుకొచ్చి కన్నీరు తుడిచాడు.

అతన్ని గ్రహించాకే జీవితంలో తొలిసారిగా స్పందించడం మొదలు పెట్టింది.

బుడ్డయ్యకి ఇద్దరు మొగపిల్లలు తప్ప ఎవరూ లేరు. భార్య పోయి సంవత్సరాలు గతించిపోయాయి. అయినా ఏనాడూ ఏ ఆడదాన్నీ చేతులు పట్టుకోనివ్వలేదు. గుండెలకి గుచ్చుకోనివ్వలేదు.

వ్యాపారాన్నీ కొడుకుల్నీ రెండు కన్నులుగా చేసుకుని నిక్కచ్చిగా నిదానంగా వ్యాపారం నడిపేస్తున్నాడు.

వ్యభిచారంలోకి దిగి నాలుగు చీరలు ఐదారు వస్తువులూ ఓ దోసెడు నేలా ఓ గుప్పెడు ఇల్లూ లాంటివి సంపాదించుకున్నవాళ్ళ అభిప్రాయం ప్రకారం సత్యవతికి లౌక్యం లేదు. మగాడి దగ్గర మరో రూపాయి గుంజే చాకచక్యం లేదు.

అయితేనేం! హృదయముంది. హృదయం నిండా మంచి ఉంది, మమత, మమకారం, స్పందనా వున్న మేలిరకం మనిషి. ఒక్క ముక్కలో చెబితే ఆమె బురదలో ఉన్న 'పద్మం.'

ఆ పద్మం బుడ్డయ్య చేతికి వెళ్ళేటప్పటికి చాన్నాళ్ళు పట్టింది. అభిరుచు లొకటై, ప్రవర్తన లొకటై, మనసు లొకటై కలిసిన ఆ ఇద్దరూ ఎందరెన్ని విమర్శలొలికించినా ఒక నిశ్చయానికొచ్చి ఒక ఇంట్లో జీవించసాగేరు.

పెద్దవాడు ఎనిమిది చదువుతున్నాడు.

కొళ్ళో కూచుని ముదురుమాటలూ, బూతుపాటలూ పాడుతున్న చిన్నవాణ్ణి కూడా చదువులో వేసేసింది. అమ్మిన డబ్బు తెచ్చి ఆమె చేతిలో పోస్తాడు బుడ్డయ్య.

అందులోంచి ఆహారానికి పోను పూలకనో పాలకనో ఖర్చుపెట్టి మిగతా శేషం భద్రంగా దాపరికం చేస్తుంది.


ఇన్నాళ్ళూ ఎవరికోసం బతుకుతుందో తెలీని సత్యవతి ప్రస్తుతం బుడ్డయ్య కోసమే జీవిస్తోంది.

* * *

ఒక్క రూపాయకోసం వచ్చిన తగాదాలో బుడ్డయ్యకి తల పగిలింది. పగిలిన తలలోంచి నెత్తురు బుస్సున పైకి చిమ్మింది.

స్పృహలోలేని బుడ్డయ్యని రిక్షాలో వేసుకుని హాస్పిటల్‌కి వెళ్ళింది.

డాక్టరు పైకి కిందికీ చూసి ఏదో పైపై వైద్యంచేసి యాభై రూపాయలు గుంజి తాత్కాలికంగా పంపించేసేరు.




ఒక సుమతి, ఒక్క సక్కుబాయి, ఓ సావిత్రి... ఎవరికీ ఏ పతివ్రతకీ తీసి పోనంత భక్తిశ్రద్ధలతో అతనికి సేవలు చేసింది. అది ధర్మంగా. అది ధ్యేయంగా.

పెద్దవాడు స్కూలుకి వెళ్తున్నాడు.

చిన్నవాడు వాణ్ణి అనుసరిస్తున్నాడు.

కొట్టు మూతపడింది.

కంటికి రెప్పలా పుండు మానేదాకా కాపాడుకునే ప్రయత్నంలో ఆమెకు ఇరవై నాలుగు గంటలూ సరిపోవడం లేదు. తపించిపోతోందతని ఆరోగ్యం కోసం.

అంతకన్నా ఎక్కువ ప్రమాదాలు జరిగిన వాళ్ళున్నారు. తలలు తెగి అతుక్కున్న వాళ్ళున్నారు.

కానీ అదేం పాపకర్మమో బిడ్డయ్య మరి కోలుకోలేదు. మూతపడిన కొట్టు మూతపడినట్టే వుంది. పిల్లల అవసరాలకు సైతం డబ్బులు చాలడంలేదు. వైద్యం మాట దేవుడెరుగు.

"మళ్ళా ఎప్పటి వూబిలో పడిపోతానా?" ఒక్కసారిగా ఆమె నరాలన్నీ గడ్డ కట్టుకుపోయాయ్.

* * *

వర్షం కుప్పతెప్పలుగా కురుస్తోంది.

పెళ్ళ బాకాల్లా కప్పలు మేళం మోగిస్తున్నాయ్.

రిక్షాలు వారలకు చేరవేసి రిక్షావాళ్ళు దుకాణాల్ని అరుగులమీదకి ఎక్కించి చిన్న దుకాణాలవాళ్ళు ఎక్కడివాళ్ళక్కడ సర్దుకుంటున్నారు.

ఇక ఎలాగూ తడిశాంలే అని

కొందరు ధీమాగా నడుచుకొస్తుంటే, ఇంకొందరు కొంపలంటుకుపోతున్నట్లు తపతప కాళ్ళను బాదుకుంటూ పరుగెడుతున్నారు

మొత్తానికి ఆ వర్షం- నేలమీద తరతరాలుగా పేరుకున్న కల్మషాన్ని కడిగేసినట్లు కడిగేసింది.

వర్షం కురిసిన ఊరు- అభ్యంగనస్నానం చేసి మళ్ళా ఎప్పటి చిరునవ్వులు చిందిస్తున్న 'శ్రీమూర్తి'లా వుంది.

ఆకాశంలో మేఘం ఒకటి నిర్మలంగా ఉన్న చెరువులో విసిరిన 'రాయిలా' ఉంది.

సత్యవతి ఒంటరిగా వుంది.

అంటుకున్న తల ఒత్తుగా చిక్కగా చూడముచ్చటేస్తోంది.

కొత్త చీర కట్టుకుంది.

మల్లెలు కొప్పని తురుముకుంది.

బ్రా వేసుకుని మేచింగు జాకెట్టు కట్టుకుంది. భగవంతుడి దయవల్ల ముసలమ్మగా రొచ్చి కల్పవల్లిలా ఆడుకుంది.

ఆవిడ అయన్నెప్పుడో చిన్నప్పుడు పెంచిందట...

కొడుకులమీద పోట్లాడి పెంచిన కొడుకు దగ్గర కొచ్చి "బుడ్డయ్యా నువ్వే నా కొడుకువి" అంది.

దగ్గరవాళ్ళనెవరినైనా దత్తత చేసుకోవచ్చు. కొడుకుల మీద అంత ఇష్టం లేకపోతే అయినవాళ్ళచేత సేవలు చేయించుకుని దబ్బునీ, బంగారాన్నీ వాళ్ళ పరం చేసెయ్యొచ్చు.

కానీ ఆమె పెంచిన ప్రేమలో ఎంత బలముందో మరి. మధ్యలో బంధానికి ఏ పరిస్థితివల్ల బీజాలు బట్టిందో తెలీదుగాని- ఓ పరిస్థితివల్ల మళ్ళా ఎప్పటి సూర్యోదయం కనిపిస్తోందా ఆ ఇద్దరి మధ్య...

కూడా రమ్మని బుడ్డయ్యని తీసుకెళ్ళింది.

సెలవులవల్ల పిల్లల్నీ తీసుకెళ్ళింది. అముదాలవలసలో ఆమెకి ఓ ఇల్లుంది. తనని "నువ్వు కూడా రా తల్లీ" అంది.

ఎంతకోరినా కానీ 'సత్యవతి' వెళ్ళలేకపోయింది. ఎక్కడ ఎవరేం ప్రశ్నిస్తే ఏం సమాధానం చెప్పాలోనని భయం - నిజం తెలిసినా ఆమె పెద్దమనసు- అలాగే ఉంటుందా? అనే సందేహం...మరో సారి వెళ్ళవచ్చన్లే- అనే సర్దుబాటూ ఆమెని వెళ్ళనిచ్చాయి కాదు. ఓ ఆధారం దొరికిందిలే అన్న సంతోషం అన్నిటినీ మించి ఆమెని ఆనందపరిచింది. అన్నీ పూర్తయి సినీమాకి గుమ్మం దాటబోయేంతలో పోలీస్ సుబ్బరాజు వచ్చాడు. ఆకలేసిన పులిలా. చేతులు జోడించి నమస్కారం పెట్టింది.

అతని కళ్ళకి ఆమెలో కొత్తదనాలూ హుందాతనాలూ కనిపించాయి...ఏ బజారులో ఎక్కడా కనిపించని కొత్తరకం తిమబండారంలా కనిపించింది.

"దా కూచుందాం" అన్నాడు నాలుక బైటికి తీసి పెదాలకి రాస్తూ...

పెద్దమనిషి వచ్చాడు.

సినీమా కెళ్ళాలంటూ చెందనాడి వెళ్ళిపోతే బాగా ఉండదనే ఉద్దేశంతో ఆమె ఆగి వెనక్కి ఓ అడుగువేసింది మరియాదగా-

"...దా... ఇక్కడ కూచో..." అని తొడ చూపించేడు.

"ఇప్పుడెలా వున్నావో తెలుసా?"

అప్పటివరకు అతనిది కీచుగొంతు. ఆ మాటతో కీచకుడి గొంతులా పలికింది. రంభతో పోల్చాడు- అలాంటివొద్దని దణ్ణం పెట్టింది. బతిమాలింది. బామాలింది.

"సుబ్బరాజుగారూ ఆ జీవితం మానేసేను. బుద్ధయ్యతో కొత్తగా బతుకుతున్నాను. దయచేసి మళ్ళీ నన్ను..." జోడించిన చేతులు జోడించినట్లే ఉన్నాయ్.

లేడిపిల్ల కన్నీళ్ళు పులిని కరిగించలేవన్న నిజాన్ని ఋజూచేస్తూ సుబ్బరాజు ఆమె చీరని లాగడలాంటి చనువుతో వెకిలిగా నవ్వుతూ వెలికి లాగడం మొదలుపెట్టేడు.

అతని చేతిలోని లాఠీని ఆమె తీసుకుంది.

"బయటికి నడుస్తావురా. పోలీసోళ్ళని పిలవమంటావా" భద్రకాళిలా మాట్లాడింది. మాట్లాడిందనే కంటే గర్జించింది అంటే సబబుగా ఉంటుంది.

సుబ్బరాజు- సుబ్బరాజంత వెధవ లేడని డిపార్టుమెంట్‌లో పేరు తెచ్చుకున్న ప్రముఖుడు.

ఆ పేరుతోనే హెడ్‌కానిస్టేబుల్ నుంచి మళ్ళా కానిస్టేబుల్‌కి డి-ప్రమోట్ అయ్యేడు.

వాడి చరిత్ర అంతా ఆమె పాడుతోంది గొంతెత్తి ఇల్లు పగిలిపోయేలా.

"నీకెలా తెల్సా- నీకెలా తెల్సా"

సుబ్బరాజు ప్రశ్నని ఉల్లిపాయముక్కల్లా తరుగుతూ-

"చూడు సుబ్బిగే... ఎస్.ఐ. ఎంకటేశ్వర్రావుగార్ని పిల్వనిమ్న..."

ఆయన చాలా స్ట్రిక్టని, పాత ఎస్సైని గంగరాజులా గడ్డితినే టైపు కాదనీ— అతనికి తెలుసు కాబట్టే ఆ పేరు వినడంతోటే షాక్ కొట్టినట్లు ఆగిపోయి ఆమె చీర ఆమెకిచ్చేసేడు.

చీర కట్టుకుంది.

అతను చేసిందానికి ప్రతిగా- అంత సత్తువ ఎలా వచ్చిందో తెలీదుగాని అతని బట్టల్ని లాగిపారేసింది. డ్రాయర్ బనీనుతో "బొక్కలో తోయిస్తా" అని బోదురుకప్పలా అరుస్తూ పలాయనం చిత్తగించేసేడు.

ఇంతలో ఎవరో ఒకతను సరాసరి లోపలికి వచ్చేడు. ఎంతో ఆప్యాయంగా పలకరించి- కూర్చోబెట్టి నవ్వుతూ మాట్లాడసాగింది...

* * *

వెళ్ళే ప్రయాణం- వచ్చే ప్రయాణం సజావుగా జరిగి, జీవితంలో కొత్తగా

ప్రవేశించిన పాతతల్లి ఆశీస్సుల్తోనూ ఇద్దరు పిల్లల్తోనూ ఊళ్ళో దిగేడు బుద్ధయ్య.

—సుబ్బరాజు నిర్వాకం చెప్పలేదామె.

చిన్నప్పుడు తను అన్నయ్యా అని పిలిచే నాగేశ్వర్రావ్ అనే అబ్బాయి వచ్చిన సంగతి మాత్రం చెప్పింది.

ఎప్పుడని అడిగేడు.

“గతరాత్రి... రాత్రంతా ఇక్కడే ఉన్నాడు...”

బుద్ధయ్య కళ్ళు ఒక్కసారిగా బాధగా అదోలా కదిలాయ్.

“...సత్యవతీ. మచ్చలేని మనసు నీది. గత జీవితం ఇప్పుడిప్పుడే మరచిపోతున్నావు. నేను లేనప్పుడు ఇతరుల్ని ఎక్కువ సేపు అనుమతించొద్దు. లోకులు నా మొగోడితనాన్ని ప్రశ్నిస్తారు. అనవసరంగా ఓ రాయి వేస్తారు.”

“నాగేశ్వర్రావ్ సత్తె ప్రమాణంగా అన్నయ్యలాంటోడు. తాళికట్టకపోయినా నువ్వు నా భర్తవి. నీ మాట కాదన్ను-” కన్నీళ్ళతో అతనివంక చూసింది.

తోడిన నీళ్ళు పోసుకుంటూ ఎందుకన్నానా అని అతడూ బాధపడ్డాడు.

మళ్ళా అతడే ఒళ్ళు తుడుచుకుంటూ-

“ఏమైనా అనుకున్నావా?” అన్నాడు అనునయంగా.

ఏం అన్నా, ఆడుకున్నా, ఒకరి మనసు ఒకళ్ళు తెలిసినోళ్ళు గనక ఆ మాటలు వారి మానసిక ప్రపంచంమీద ఎలాంటి ప్రభావం చూపించలేదు.

క్షణాలు గడిచేకొద్దీ ఇంటి స్వరూపం మారడంలో డబ్బు పాత్ర చాలా ఉంది. 'ముసలమ్మ'గారు రావడం కథలో పెద్ద మలుపు. ఆవిడ డబ్బూ బంగారమే బుద్ధయ్య జీవన గమనానికి శ్రీరామరక్ష అయింది. అందులో సత్యవతి కూడా ప్రధాన భాగస్వామి అయిపోయింది.

కట్టుకున్న పట్టుచీరనో, పెట్టుకున్న అలంకారాన్నో చూసి లోగడ తనతో బతికేవాళ్ళూ, కొద్దిపాటి పరిచయస్థులూ, స్నేహితం ఉన్నవాళ్ళూ అదృష్టవంతురాలివి సత్యవతీ అంటున్నారు.

కుర్రవాళ్ళు ఎదిగొస్తున్నారు.

ఆముదాలవలసలో ఇల్లు అమ్మేసి ముసలమ్మగారు కూడా మకాం ఇక్కడే పెట్టేసింది.

బుద్ధయ్య అదివరకటి బడ్డీకొట్టు కూల్చేసి సిమెంటుతో అందంగా చిన్న హోటల్ కట్టించాడు. సత్యవతి అన్నీ దగ్గరుండి చూసుకుంటోంది.

ఓ రోజు రాత్రి హోటల్ కట్టేసే సమయంలో సత్యవతి ఒక్కతీ మెట్లు దిగుతోంది. బుద్ధయ్య ఊళ్ళోలేడు.

పనివాళ్ళు అప్పటికే వెళ్ళిపోతున్నారు. తొందరగా వెళ్ళిపోవాలన్న ఆత్రతలో మెట్లు దిగీదిగ్గానే ఎవరో మనిషి తూలి, స్పృహలేకుండా పడిపోయి ఉన్నాడు.

గడ్డం బాగా మాసి ఉంది. మకిలి పట్టిన పైజమా, తైలసంస్కారం లేక

కొబ్బరిపీచులా ఉంది జుట్టు...

అలాగే కొన్ని క్షణాలు అతన్ని చూస్తూండిపోయింది.

ఇంతలో ఏదో ఆమె మెదడులో తళుక్కున మెరిసింది

* * *

పెద్దవాడు రవికి ఇంటరయింది.

చిన్నవాడు రాముడు నైన్త్‌దాకా వచ్చాడు.

అలనాటి ఆ సంఘటన గుర్తుకు రాగానే ఒక్కసారి ఒళ్ళు జలదరించింది.

నరసింహారావ్-అసలతడనుకోలేదు-ఎవరో తాగుబోతనుకుంది.

చివరకు హోటల్ పనివాడి సహాయంతో అతణ్ణి ఒకప్పటి నరసింహారావుగా గుర్తించి, దుర్మార్గుడైనా సరే సేవలుచేసి పంపించింది.

వ్యసనాలకులో బడి పాడైపోయాడట. అతని భార్య అతన్ని తరిమేసింది.

ఎంత చిత్రం- ఒకనాడు తనని అతడు తరిమేసేడు.

ఈనాడు అతని భార్య అతన్ని తరిమేసింది. అప్పుడు ఆ కథ చెప్పి, తను చేసిన పనిని వివరిస్తే బుడ్డయ్య మాట్లాడలేదు గాని అలాంటివాళ్ళకు మంచి చేసినా చెడ్డేనేమో అన్నాడు. తనకి బాగా గుర్తుంది.

అనుభవాలలో, జ్ఞాపకాలలో, ఆమె తల నెరుస్తోంది.

పెద్దబ్బాయికి ఫస్టు మార్కులొచ్చాయి. ఇంకా చదువుతాననంటున్నాడు.

చిన్నవాడికి చదువంటే ఆకర్షణలేదు కాబట్టి అతడే హోటల్‌కి కాబోయే యజమాని అనుకుంటున్నారు.

ముసలమ్మగారు చూస్తే మంచంమీద ఉన్నది.

ఒకపూట మాత్రం తింటున్నది.

డాక్టర్ రాజు వచ్చి రోజూ చూసిపోతున్నాడు.

పెద్దవయసు వచ్చాకా చాలామందికి వచ్చే ఉన్మాదంలాంటిది ఆమెకీ వచ్చింది.

దగ్గరకు వెళ్తే పిల్లల్ని పెద్దవాళ్ళనీ కరుస్తోంది.

ఆకల్లేకపోయినా అన్నం పెట్టమని మారాం చేస్తోంది.

బట్టల్లో విరేచనం చేసుకున్నప్పుడల్లా కడిగించుకోనని పెద్ద పోట్లాట...

ఆవిడ బుడ్డయ్యను కన్నకొడుకుగా భావించుకుని ఎలాగైతే ఆదరించిందో అలాగే తనూ తన కన్నతల్లికి సేవ చేసినట్లు చేస్తోంది సత్యవతి.

అప్పుడే కడిగి అత్తగార్ని పడుకోబెట్టి. వీధి గుమ్మంలో కూచుని చిన్నవాడి లాగు సూదీ దారంతో కుడుతోంది.

అంతలోనే అటూ శమంతకమణి పోతూ ఆగింది.

మొదట్లో ఇద్దరి మధ్య వైరంలాంటిది ఉండేది. ఆ తర్వాత స్నేహమే మిగిలింది. శమంతకమణి కూడా తెలివైందే. మనసున్నదే. అయినా అలవాటుపడిన

ఆ ఛండాలపు వృత్తినుంచి బైటికి రాలేక పోయింది ఆ మాటే అంటూ ఉంటుంది కలిసినప్పుడల్లా...

"అమ్మో పన్నెండయిందే-" అంది శమంతకమణి.

"కాలమాగుద్దా. ఏంటి విశేషాలు... ఇదిగో ఇలాగుంది పరిస్థితి. ముసలావిడ మారాం పట్టేసింది. నా ధర్మం నేను చేస్తున్నాను."

"ఏమైనా అదృష్టవంతురాలివేనే నువ్వు" అప్రయత్నంగా ఆమె కళ్ళ వెంట నీళ్ళొచ్చాయి.

"నీ జీవితానికంటూ ఓ నీడ దొరికింది" వచ్చిన కన్నీళ్ళను తుడుచుకుని ఇచ్చిన మంచినీళ్ళను తాగి, గ్లాసు చేత్తో పట్టుకుంది.

"మా బావయ్య ఎప్పుడొస్తాడే..."

"ఇదిగో. భోజనానికి రావాలే బాబూ."

"నువ్వు నాకో సాయం చెయ్యగలవా?"

"బావగారితో చెప్పి పప్పురుబ్బే పని అయినా ఇప్పించగలవా?"

ఒక్కసారి సత్యవతి పాలోచనగా చూసింది.

"ఏమే..."

"అవునే... ఈ వృత్తి మీద రోత పుడుతోందే... ప్రతివాడికీ లోకువే. దీని కన్నా కష్టపడి పదిరూపాయలు తెచ్చుకునే ఏ పనన్నా గౌరవం కాదంటావా?"

"మణీ. మంచిగా బతుకుతానంటే ఎవరొద్దంటారే- పైగా నాకు నువ్వు చెల్లెల్లాంటి దానివి..."

"నువ్వు ఆయనదాకా అక్కర్లేదు. నేనే చెప్తాను- రేపట్నుంచొచ్చేసేయ్-"

కృతజ్ఞత నిండిన కళ్ళతో శమంతకమణి లేచి వెళ్ళిపోయింది.

వెళ్ళిపోయేముందు చిన్న సంభాషణ-

"ఏమిటే గొడవ అయిందంటున్నారు?"

"అవునే- వూరి మధ్యలో గుడిసెలేంటని గాంధీ సమాజంవాళ్ళు అల్లరి చేస్తున్నారు. దానికి అధికారులు కూడా వంతపాడి గుడిసెలు పీకెయ్యమంటున్నారు... మనోళ్ళు లబోదిబో మంటున్నారు..."

"అలాగా..."

* *

ముసలావిడ స్వర్గం వెళ్ళిపోయింది.

వెళ్ళిపోతూ- బుద్ధయ్యనీ- సత్యవతినీ ఆర్ద్రంగా ఓ చూపు చూసి ఓ యాభై వేలు పదిమందికీ పనికొచ్చే ఏ పనికైనా ఖర్చుపెట్టమని ఆఖరి కోరికగా కోరి ఇహాన్ని చాలించింది.

ఊహ వచ్చేటప్పటికే తల్లి మమకారం తెలీకపోయినా, కొన్నాళ్ళటి సంబంధం పునాదిగా చాలా ఆలస్యంగా జీవితంలో ప్రవేశించినా సొంత తల్లి మరణించినప్పటి ఫీలింగు- బుద్ధయ్యలో కనిపించింది.

సత్యవతి కూడా అంతే ఆర్తితో బాధ

పడింది-

ఆస్తి ఎవరో ఓ అనామకుడి పాలు చేసినందుకే కుతకుత ఉడికిపోతున్న అయినవాళ్ళు తల్లి చావువిషయం తెలిసినా ఆ ఛాయలకు తొంగిచూడలేదు. అయినా అన్నీ సజావుగానే జరిగాయి—

శమంతకమణి కూడా దగ్గర దగ్గర ఉండి సత్యవతికి ఎంతో సహకారం పంచిపెట్టింది.

పెద్దవాడికి బి.ఎస్సీ. అయిపోయింది.

చిన్నవాడు హోటల్ నడుపుతున్నాడు

రవి అంటే ముసలావిడకి ప్రాణం.

మనవడి పెళ్ళి చూస్తానో చూడనో అని ఆవిడ కోకొలు తీసేది. ఆఖరికి ఆ కోరిక తీరకుండానే మహాప్రయాణం కట్టేసిందావిడ.

చిన్నవాడు రాముణ్ణి 'పిపీనారి' అని పిలిచేది. చచ్చిపోయే ముందుదాకా రామనామం మానిందికాదు. ఆ ఊళ్ళో జనం ముసలావిడ గురించి రెండు మూడు రోజులవరకూ చెప్పుకుని ఆ తర్వాత ఆ విషయమే మర్చిపోయేరు.

ఓ ఆదివారం పూట శమంతకమణి చెప్పింది.

గాంధీ సమాజంవాళ్ళు పట్టుపట్టి వ్యభిచారం కొంపల్ని పీకించేశారని...

ఆ విషయమై శమంతకమణి చాలా జాలిపడింది. ఎందుకంటే ప్రస్తుతం ఆమె సత్యవతిలా కాకపోయినా సత్యవతితోనే ఉంటుంది గనక...

ఆ సాయంత్రమే చిన్నబాబుగారి మకాం దగ్గర అందరూ కలిసేరు.

"రత్నారావు బాబు మనకోసం తన స్థలంలో ఓ పెద్ద ఇల్లు కట్టిస్తాడట..." కాయమ్మ చెప్పింది.

"ఇంతవరకూ మన కష్టమేదో మనం తింటున్నాం- ఈరోజున అతను ఇల్లు కట్టిస్తే రేపు రూపాయికి రెండు చొప్పున మనదగ్గర లాగుతాడు" సుబ్బలక్ష్మి అనే అమ్మాయి వెంటనే అందుకుంది.

"పీనా విరగడైంది. నేను రాజమండ్రి వెళ్ళిపోతాను బాబూ- అక్కడే ఉంటే సరిపోయేది." చిట్టి అనే అమ్మాయి తన బొమ్మలు విశాలంచేస్తూ ధనాధన్ మాట్లాడేసింది.

"ప్రస్తుత కర్తవ్యం ఏమిటి?"

ఎవరో అడిగారు.

ఇంతలో చిన్నబాబుగారు అటు వచ్చారు

"ఒకటి రెండురోజులైతే ఉండండి. కానీ ఇక్కడ ఇతర పన్లు జరిగితే ఊరుకోను." కరాఖండీగా చెప్పాడాయన.

"ఎన్నో సంవత్సరాలుగా అక్కడే ఉంటున్నాం కదా బాబూ...మరి మాకేం ఉపకారం జరగదా?" కాయమ్మ లోపాయికారిగా అడిగింది.

చిన్నబాబుగారు తలకాయ పూపేరు తప్ప నోరు కదపలేదు. పెద్దవాళ్ళు అన్నిటికీ నోరు విప్పరు. అందరికోసం అన్నిటిలో.చేతులు పెట్టరు. వాళ్ళ ఆలోచనలూ

వాళ్ళ వెళ్ళిరావడాలూ...ఆయా సంబంధ బాంధవ్యాలూ ఓ ప్రత్యేక ప్రపంచానికే అంకితమై ఉంటాయ్.

ఆయన బదులూ తన బదులూ తనే మాట్లాడి కాయమ్మ సెలవు పుచ్చుకుంది.

ఇక్కడ ఇంత జరుగుతోన్న విషయం సత్యవతికి తెలిసింది.

వెంటనే కాయమ్మకి కబురు పంపించింది-

పొట్టోడి రిక్షామీద కాయమ్మ క్షణాల్లో సత్యవతి ముందు వాలింది.

"కాయమ్మక్కా - మనవాళ్ళందరూ ఒక మాటమీద ఉంటారంటావా?"

"ఉంటారు..."

"ఎవరికి ఏ పని చెయ్యాలని ఉందో కనుక్కో. ఆ పనిలో ట్రైనింగ్ ఇప్పిద్దాము. అన్నాళ్లూ నా ఇంట్లో నేను పోషిస్తాను. కాకపోతే ఆ పని మానెయ్యాలి. సొతంత్రంగా ఎవళ్ళ కాళ్ళమీద వాళ్ళని నిలబెట్టాలన్నా ఉద్దేశం" అంది.

కాయమ్మ సాలోచనగా తలూపి మళ్ళీ పొట్టోడి రిక్షామీదే అక్కడికి వెళ్ళింది.

ఎలాగైనా సరే వీళ్ళని పట్టి ఓ పంజరంలో పెట్టి వేలు సంపాదిద్దామన్న కోరికతో రత్నారావు వచ్చి ఆ పరిసరాల్లోనే మకాం పెట్టేసేడు.

"ఒకళ్లు బైటికి లాగాలని చూస్తుంటే ఇంకొకళ్ళు లోపల ఉంచాలని చూస్తారు. ఈ లోకం తీరే అంత" గుంభనంగా నవ్వుకుంది కాయమ్మ.

బైటికి లాగడం- అంటే కత్తిమీద సామేనని అది అందరివల్లా కాదని ఆమెకి తెలుసు. కానీ మొదట్నుంచీ సత్యవతి గురించీ, సత్యవతి పట్టుదల గురించీ తెలుసు.

ఏమే...ఒసే...ఒసే...అంటూ నలుగుర్నీ పిలిచి విషయం చెప్పింది. కొందరు ఔనన్నారు. కొందరు వెక్కిరించారు- కొందరు పొదుగూళ్ళకి పోతామని తెగేసి చెప్పారు. మొత్తంమీద గంటా గంటన్నర శ్రమపడి కాయమ్మ వాళ్ళని ఓ కొలిక్కి తీసుకురాగలిగింది.

*   *   *

"వాళ్ళతో సంబంధా లేమిటమ్మా. నా స్నేహితులు నలుగురూ నాలుగురకాలుగా అంటున్నారు" అని పెద్దవాడు రవి మొదట్లో ఘర్షణపడినా—

చిన్నవాడూ ఓ పట్టాన అంగీకరించక పోయినా తన కృషివల్ల, నేర్పువల్ల, సంకల్ప బలంవల్ల అందరినీ ఒప్పించి అనుకున్న ఫలితాల్ని రాబట్టగలిగింది సత్యవతి.

ఏ స్థలంలోనైతే రత్నారావ్ వాళ్ళ కోసం ఇల్లుకట్టి వేలు గడిద్దామనుకున్నాడో అదే స్థలంలో "మానవతా సదన్' అనే పెద్ద గడ్డియిల్లు వెలిసింది. చుట్టూ పూలమొక్కలు...అందమైన... తీగలు...అల్లుకున్న లతలు.. నీటికోసం ఓ కుళాయి...ఇల్లు గదులు గదులుగా విశాలంగా రోడ్డు పాయింటున ఉంది.

అందరిలో ఆత్మవిశ్వాసం పొంగులు వారుతోంది. కొందరు పిల్లలాటకి పిచి కలు తయారుచేస్తున్నారు. ఇంకొందరు ఎర్రగా కాల్చిన కుండలకు డిజైన్లు వేస్తు న్నారు. మరికొందరైతే కొమ్ములు చెక్కి దువ్వెనలూ,అందమైన కొంగలూ నెమళ్ళూ చేస్తున్నారు

మార్కెట్‌చేసే బాధ్యత సత్యవతి భర్త బుడ్డయ్యకీ చిన్నకొడుకు రాముడికీ అప్పగించి తను హోటల్ రన్‌చేయడం మొదలుపెట్టింది.

ముసలావిడ పేరు "మునలమ్మే."

అయినా అక్కడ నిలబెట్టి పెట్టిన ప్రతిమలోంచి 'నా ఆశయం నెరవేర్చావు కదే సత్యవతీ' అన్నట్లు నవ్వుతూ పడుచుపిల్లలా దర్శనమిస్తోంది.

సంపారులు చెక్కిన శిల్పాల్లాంటి వాళ్ళు. వాళ్ళకొక రూపురేఖా. స్థిరత్వం వగైరా ఉంటాయ్. పానివాళ్ళు రోడ్డు పక్కన రాళ్ళలాంటి వాళ్ళు.

రిస్కుతీసుకుని శ్రమిస్తే ఈ రాళ్లను ఆ శిల్పాలకన్నా అందంగా తీర్చిదిద్ద వచ్చును. అదెప్పుడు సాధ్యమంటే మార్పులనుకున్నవాళ్ళ స్పందనకు అను గుణంగా ఎవరు మారాలో వాళ్ళు ప్రతి స్పందించినప్పుడు.

మహా సంస్కర్తగా వెలుగొందిన వీరేశలింగంగారు నడిచిన నేలమీదే- ఇసకవీధి- మెరకవీధీ అంటూ ఇంకా ఆ వ్యాపారం నిరాఘాటంగా సాగిపోతోంది.

సత్తెమ్మ కంపెనీ, వెంకమ్మ కంపెనీ అంటూ రైల్వేస్టేషన్ల దగ్గరా, సినిమా హాళ్ళదగ్గర ఒళ్ళమ్ముకునే ఇళ్ళు బారులు బారులుగా దర్శనమివ్వడం దిగజారి పోయిన మన భారతీయ సంస్కృతికి గొప్ప ఉదాహరణ.

అనాదిగా స్త్రీని పురుషుడు వడగొడు తున్నాడు. చెడగొడుతున్నాడు. ఆమె శిలా నికి వెలకట్టి ఓ బొమ్మతో ఆడుకున్నట్లు ఆడుకుంటున్నాడు.

అలాంటి వ్యవస్థ నుంచి- ఆడపిల్లను వెలికితీసే ప్రయత్నం సత్యవతి ద్వారా మొట్టమొదట జరిగింది. ఇంకా జరగాలి.

ఓ రోజున మానవతా సదన్ నుంచి గుర్రపు బండిలో ఇంటికి వెళ్తూ- "సుబ్బన్నా..ఇప్పుడు అళ్ళెంత హాయిగా ఉన్నారో తెల్సా. నా చేతయింది నేను చేశాను. మనిషికి కడుపు నిండనప్పుడే నీతి తప్పుతాడు. అలాంటి అడ్డులు తీసేసి అందరిలో నమ్మకం పెంచి అనుకున్నది సాధించేశాను..."

బండి దిగుతూ అడిగింది

"సుబ్బన్నా ఆ కుర్రాడెవరు నీర సంగా నడుస్తా వున్నాడు."

"రంగన్న కొడుకమ్మా. పదేళ్ళ నుంచీ ఉజ్జోగంలేదు."

ఆమె లోపలికి వెళ్ళిపోయింది. బండి రోడ్డును తొక్కుకుంటూ స్పీడుగా వెళ్ళి పోయింది.

* *